సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 17 । జూన్ । 2024



**నిబంధనలు బేఖాతరు..**

ఆస్పత్రులు, పెట్రోల్ బంకులు, కొనసాగించాలంటే సంబంధిత యాజమాన్యాలు ముందుగా అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సిందే.

- 8లో



**నేల బావిలో పడిన ట్రాక్టర్**

నేలబావిలో ట్రాక్టర్ పడిపోవడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని రేగ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది.

- 8లో



**టీకాలతో వ్యాధులు దూరం..**

వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి.

- 8లో

## న్యూస్‌రీల్

### ఐఐహెచ్‌టీలో స్పాట్ అడ్మిషన్లు

గుర్ల: రాష్ట్రంలోని తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో ఐఐహెచ్‌టీకి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ ఎ.డి మురళికృష్ణ ఆదివారం తెలిపారు. ఈనెల 20న స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు, పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనునట్లు చెప్పారు. ఈకోర్సులో మొదటి ఏడాది పూర్తయిన వారు బీటెక్ రెండవ ఏడాదిలో ప్రవేశించడానికి అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ 9441795408, 9866169908, 9010243054 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### కేజీన్నర గంజాయి పట్టివేత

రామభద్రపురం: మండలకేంద్రంలో పోలీసులు ఆదివారం కేజీన్నర గంజాయి పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరు వ్యక్తులు గంజాయితో వస్తున్నారన్న సమాచారం మేరకు తహసీల్దార్‌తో పాటు ఎస్సై జ్ఞానప్రసాద్, పోలీసు సిబ్బంది స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మాటు వేశారు. గంజాయితో వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిని కృష్ణాజిల్లా నాగాయలంక గ్రామానికి చెందిన పెనుమల పూర్ణకిశోర్, విజయవాడ సిటీకి చెందిన చీపురుపల్లి ప్రేమ్‌కుమార్‌గా గుర్తించారు. వారు ఒడిశాలోని కొరాపుట్ పరిసర ప్రాంతాలలో గంజాయి కొనుగోలు చేసి విజయవాడకు అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేంకటేశ్వరునికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని తెలగవీధి సత్యనారాయణపురం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, ఉత్సవ సంకలనం, అంకురారోహణ, మండపారాధన, అగ్నిప్రతిష్టాపన కార్యక్రమాలు చేపట్టారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు




బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్‌ఐ

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, సంకిలి, బూరాడ కూడళ్లలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఆదివారం చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా వస్తున్న వాహనాలను ఆపి, వాహనదారులు మద్యం తాగినదీ లేనిదీ బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. అనంతరం మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన పలువురిపై కేసులు నమోదు చేశారు. మద్యం మత్తులో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### త్యాగానికి ప్రతీక బక్రీద్

పార్వతీపురంటౌన్: ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే పండగల్లో బక్రీద్ ఒకటి. ఈ పండగను త్యాగానికి ప్రతీకగా చెబుతారు. ఈద్–ఉల్–జుహా అని కూడా ఈ పండగను పిలుస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం చివరి నెల జిల్ హిజ్జ. ఈ నెల 10వ రోజున బక్రీద్‌ను ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకుంటారు. అల్లాహ్ ఆజ్ఞను తు.చ తప్పకుండా పాటించడమే ఈ పండగ అర్థం. నేడు బక్రీద్ జరుపుకోవాలని మత పెద్దలు ప్రకటించారు.

# మన్యంలో మలేరియా ముప్పు





మలేరియా, డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్యబృందం

- ఆశ్రద్ధ చేస్తే ప్రాణానికే ప్రమాదం
- గ్రామాల్లో పడగవిప్పుతున్న జ్వరాలు
- 265 పాజిటివ్ కేసుల నమోదు
- జూన్ నెలంతా మలేరియా నివారణపై అవగాహన



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో మలేరియాతో వణుకుతూ చికిత్స పొందుతున్న బాలిక

సీతంపేట: మలేరియా పేరు చెబితేనే గ్రామాల్లో చాలా మంది ప్రజలు వణికిపోతున్నారు. నెలల తరబడి ఈ జ్వరం పీడిస్తూ ఉండడమే ఇందుకు కారణం. మలేరియా వ్యాధి సోకిందంటే ఒక పట్టాన తగ్గదు. కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా సంభవిస్తుంటాయి. పార్వతీపురం మన్య జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో మలేరియా పడగ విప్పుతోంది. ఏ పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రికి వెళ్లినా మలేరియా పాజిటివ్‌తో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ నెలను యాంటీ మలేరియా మంత్‌గా ప్రకటించారు. గతేడాది జనవరి నుంచి జూన్ వరకు దాదాపు 150 మలేరియా పాజిటివ్ కేసులు నమోదు కాగా ఈసంవత్సరం 265 మంది ఇప్పటివరకు మలేరియా పాజిటివ్ కేసుల బారిన పడినట్లు వైద్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. లక్షా 20వేల రక్త పరీక్షలు చేశారు. ఇంకా ప్రైవేట్ ఆస్పత్రులు, నంచి డాక్టర్లను ఆశ్రయించిన వారిని లెక్కిస్తే 500ల వరకు మలేరియా పాజిటివ్ ఉంటాయని వైద్యనిపుణుల అంచనా. అప్రమత్తంగా ఉండడంతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మలేరియా నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**మలేరియా లక్షణాలు..**

మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే దోమకాటు వల్ల వస్తుంది. వర్షాకాలంలో దోమలు పెరిగే ప్రదేశాల్లో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, మూత్రం మందగించడం, కడుపులో నొప్పి, జ్వరం మూడు రోజులకొకసారి లేదా రెండు రోజులకొకసారి లేదా రోజు మార్చి రోజు వస్తూ ఉండడం వ్యాధి లక్షణాలు.

**వ్యాధి నిర్ధారణ ఇలా..**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ గంట వ్యవధిలోపు చేస్తారు. రక్తపు పూతలు సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే క్లోరోక్విన్, ప్రైమాక్విన్ మాత్రలను ఇస్తారు. అవి 14 రోజులు ఆపకుండా తప్పనిసరిగా వాడాలి. ఈ మందులన్నీ ఉచితంగా పీహెచ్‌సీల్లో అందజేస్తారు.

**దోమలు పెరగకుండా జాగ్రత్తలు..**

ఇంటి పరిసరాల్లో దోమలు పెరిగేందుకు ఆస్కారం లేకుండా మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలి. వారానికి ఒకసారి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరిబొండాలు, పాతటైర్లు, రోళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమలు ఇళ్లలోకి రాకుండా నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. లెట్రిన్‌పైపులకు పైన వస్త్రాన్ని కప్పి ఉంచాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమ తెర వాడడం ద్వారా దోమకాటు బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

### నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు



జిల్లాలో మలేరియా నివారణకోసం ప్రత్యేకంగా..ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ నిర్వహిస్తున్నాం. మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో మలాథిన్ ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ చర్యలు చేపడుతున్నాం. 401 మలేరియా హైరిస్క్ గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నాం. దాదాపు ఈ ప్రక్రియ పూర్తికావచ్చింది. ప్రతిరోజూ డ్రైడే నిర్వహిస్తున్నాం.

టి.జగన్‌మోహన్‌రావు,
డీఎంఓ నివారణాధికారి

### అందుబాటులో మందులు



మలేరియా నివారణకు మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. సరైన రక్త పరీక్షలు చేసి అందరికీ ఉచితంగా ఇస్తున్నాం. ప్రస్తుతం మలేరియా పాజిటివ్ కేసులు అధికంగా వస్తున్నాయి. జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసి వైద్యసేవలు అందిస్తున్నాం.

బి.శ్రీనివాసరావు,
ఏరియా ఆస్పత్రి ప్రధానవైద్యాధికారి

# మంత్రి సంధ్యారాణిని కలిసిన ప్రముఖులు



మంత్రి సంధ్యారాణిని కలిసిన ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు

సాలూరు: గిరిజన సంక్షేమశాఖ, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఆమె స్వగృహంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు తదితరులు కలిసి ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయా శాఖాపరమైన అంశాలపై చర్చించారు.

# 'ప్రియ'మైన టమాటో

- అమాంతం పెరిగిన ధర
- కొనుగోలు చేయలేకపోతున్న సామాన్యులు



పార్వతీపురం: టమాటో ధర పైపైకి ఎగబాకుతోంది. ప్రస్తుతం కిలో టమాటో హోల్‌సేల్‌గా రూ.80కు లభిస్తుండగా, రిటైల్‌గా రూ.100కు విక్రయిస్తున్నారు. పల్లెల్లో రూ.110నుంచి రూ.120 వరకూ వర్తకులు అమ్ముతున్నారు. కొద్ది రోజుల నుంచి టమాటో ధర కిలో రూ.40లోపు ఉండగా ఒక్కసారిగా పెరిగింది. దీంతో సాధారణ కుటుంబాలు ప్రస్తుతం టమాటోను కొనలేని పరిస్థితి కనిపిస్తోంది. రానున్న రోజుల్లో ఈ ధర మరింత పెరిగే ఆస్కారముందని వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవి తీవ్రత దృష్ట్యా పంట దిగుబడులు తీవ్రంగా తగ్గిపోవడంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి కాకపోవడంవల్ల ధరలు పెరుగుతున్నాయని వర్తకులు చెబుతున్నారు.


# జలకళ



నీటితో కళకళలాడుతున్న నారాయణపురం ఆనకట్ట

సంతకవిటి: మండలంలోని రంగరాయపురం వద్ద ఉన్న నారాయణపురం ఆనకట్ట జలకళను సంతరించుకుంది. గడిచిన రెండురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఎత్తైన ప్రాంతాల నుంచి ఆనకట్టలోకి పెద్దఎత్తున నీరు వచ్చి, చేరుకుంది. ఆదివారం నాటికి ఆనకట్టలో నీటిమట్టం పెరిగిందనిఅధికారులు చెబుతున్నారు.

# వచ్చేశామోచ్..!



బొండపల్లిలోని రామన్న సాగరం చెరువులో ఆకట్టుకుంటున్న సైబీరియా పక్షులు

- కనువిందుచేస్తున్న సైబీరియా పక్షులు
- ఏటా జూన్ నెలలో వచ్చి డిసెంబరు వరకు విడిది
- కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా రాక

బొండపల్లి: వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి వివిధ దేశాలు దాటి క్రమం తప్పకుండా జిల్లాలోని బొండపల్లి ప్రాంతానికి వలస వస్తున్న విదేశీ సైబీరియా దేశ వలస పక్షులు ఈఏడాది కూడా తిరిగి వచ్చి సందర్శకులకు కనువిందు చేస్తూ ఆకట్టుకుంటున్నాయి. పొడవాటి ముక్కు, కాళ్లు, భారీ ఆకారంతో పాటు, శరీరమంతా తెల్లని వెంట్రుకలు, మెడ దగ్గర మాత్రం తెల్లని వెంట్రుకలతో పాటు ఎరుపు రంగు వెంట్రుకలు కలిసి చూడగానే ఇట్టే ఆకట్టుకునే సైబీరియా దేశానికి చెందిన పక్షులు కొన్ని సంవత్సరాలుగా బొండపల్లి మండలానికి చేరుకుని విడిది ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ పక్షులు సైబీరియా దేశం నుంచి ఏటా జూన్ నెలలో వలస వచ్చి వేసవి కాలంతో పాటు వర్షాకాలం ఇక్కడే ఉండి తిరిగి తమ సొంత దేశానికి వలస వెళిపోతుంటాయి.ఇది క్రమం తప్పకుండా జరుగుతోంది.

**చెరువుల్లో ఆహారం సేకరణ**

సైబీరియా పక్షులు మండల కేంద్రాన్ని ఆనుకుని ఉన్న రామన్న సాగరం చెరువులో లభించే చిన్న, చిన్న చేపలతో పాటు ఇతర ఆహారాన్ని సేకరించుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉండి సాయంత్రం గజపతినగరం మండలంలోని లోగిశ గ్రామంలో గల చింత చెట్లను ఆవాసంగా చేసుకుని రాత్రంతా అక్కడే ఉంటాయి. తిరిగి ఆహారం కోసం ఉదయాన్నే చెరువు వద్దకు రావడం ఆరు నెలల పాటు జరుగుతుంటుంది.

**పిల్లలు పెద్దవయ్యాక వలస**

ఇక్కడికి ఈ పక్షులు జూన్ నెలలో వచ్చి సెప్టెంబర్ కల్లా గుడ్లు పెట్టి పిల్లలను పొదిగి, అవి పెద్దవై ఎగిరే అవకాశం ఉన్నంత వరకు అంటే డిసెంబరు వరకు ఒక్కడే ఉండి తిరిగి పిల్లలతో సహా వాటి సొంత దేశం సైబీరియాకు వలస వెళ్లిపోతాయి. ఈ పక్షులు వచ్చాయంటే తమకు మంచి జరుగుతుందని ఈ ప్రాంత వాసులు భావిస్తుంటారు.

**హాని చేస్తే జరిమానా విధింపు**

ఈ పక్షులకు లోగిశ గ్రామం, చుట్టుపక్కల గ్రామాల వారితో పాటు బొండపల్లి చుట్టు పక్కల గ్రామాల వారు ఎటువంటి హాని తలపెట్టరు. అలాగే వాటికి ఎవరూ హాని చేసినా, వాటిని పట్టుకున్నా జరిమానా విధించాలని ఇక్కడి వారే కట్టుబాటు పెట్టుకుని పక్కాగా అమలు చేస్తున్నారు. ఇక్కడ జూన్ నెల నుంచి ఎండల తీవ్రతతో పాటు,ఆ తర్వాత వర్షాలు పడడం వల్ల సైబీరియా పక్షులకు ఇక్కడి వాతావరణం గుడ్లు పెట్టి పిల్లలు పొదిగేందుకు అనువగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే క్రమం తప్పకుండా ఈ పక్షులు ఏటా వలస వస్తున్నాయని భావిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.



రామన్న సాగరం చెరువులో మేత మేస్తున్న సైబీరియా వలస పక్షులు

# సొమ్ము కొట్టు.. పోస్టు పట్టు..!

- సర్కారీ కొలువు పేరిట మోసం
- పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్ పేరిట జాయినింగ్ ఆర్డర్లు
- ఆర్డర్లు పరిశీలించకుండానే విధుల్లో చేర్చుకున్న విద్యాశాఖ
- ఒక్కో పోస్టుకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించిన బాధితులు

వీరఘట్టం: ప్రభుత్వ ఉద్యోగాల పేరిట దేశంలో ప్రతి చోట నిత్యం మోసాలు జరుగుతున్నప్పటికీ ఇంకా చాలా మంది యువత మేల్కోవడం లేదు. సులువుగా ఉద్యోగాలు పొందేందుకు ప్రయత్నిస్తూ మోసపోతూనే ఉన్నారు. తాజాగా ఇటువంటి మోసమే పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం మండలంలో వెలుగుచూసింది. 'చిల్డ్రన్స్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ చేంజింగ్ అసోసియేటర్' అనే సంస్థ పేరిట ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ ముఠా నిరుద్యోగ యువతకు వలవేస్తున్నారు. మీ సొంత ఊరిలో నెలకు రూ.25 వేల జీతం వచ్చే సర్కారు బడుల్లో కొలువులంటూ చేసిన మోసపూరిత ప్రకటనలకు వీరఘట్టానికి చెందిన ముగ్గురు మహిళలు ఆకర్షితులయ్యారు. ఒక్కో పోస్టుకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించేసి తమకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయనే భ్రమలో ఉన్నారు. దీనికి సంబంధించి సాక్షి పరిశీలనలో వెలుగులోకి వచ్చిన వివరాలిలా ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌గా తమకు పోస్టులు వచ్చాయంటూ ముగ్గురు మహిళలు ఈనెల 13న వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో ఒకరు, కంబరవలస, వండవ జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ఒక్కొక్కరూ విధుల్లో చేరారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తమకు వచ్చిన జాయినింగ్ ఆర్డర్లు చూపించి మూడు రోజుల క్రితం విధుల్లో చేరారు. వారికి ఆయా పాఠశాలల్లో ప్రత్యేకంగా ఓ అటెండెన్స్ రిజిస్టర్ కూడా పెట్టారు.

**గతంలో కూడా కొంతమంది బలి**

గతంలో కూడా కొంత మంది దళారులు నిరుద్యోగులకు వలవేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో కిండర్ గార్డెన్ కో–ఆర్డినేటర్ పోస్టులు, గార్డెనర్ పోస్టులను పలు పాఠశాలల్లో వేయించారు.ఈ పోస్టుల్లో చేరిన వారు రెండు, మూడు నెలలు పనిచేసి జీతాలు రాకపోవడంతో మానేశారు. అలాగే ఇటీవల యోగా టీచర్ల పేరిట జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నియామకాలు చేపట్టారు. వారి నుంచి సుమారు రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు.వీరు కూడా జీతాలు రాకపోవడంతో మానేశారు. నిరుద్యోగ యువతను వీరు ఎంచుకుని వలపన్ని ఈ ఉచ్చులోకి దించుతూ ఉద్యోగాలు ఆశ చూపి వారి నుంచి రూ.లక్షల్లో సొమ్ము కాజేసి మాయమవు తున్నారు.

**పద్ధతి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగం**

ఏదైనా ప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయాలంటే ముందుగా అక్కడ ఖాళీలు ఎన్ని ఉన్నాయి? బడ్జెట్ కేటాయింపు, కేబినెట్ ఆమోదం, తర్వాత గెజిట్ నోటిఫికేషన్, జీఓ జారీ చేయాలి. తర్వాత అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే..వారి రిటన్ టెస్ట్ లేదా మౌఖిక పరీక్ష నిర్వహించి అప్పుడు అర్హులైన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. తర్వాత ఉద్యోగం వచ్చిన వారికి పోలీస్ వెరిఫికేషన్ ఉంటుంది.సొంతంగా డిక్లరేషన్ ఫారం ఇవ్వాలి. ఇలా చాలా ప్రోసెస్ ఉంది. అయితే ఇవేవీ లేకుండా సర్కారు బడుల్లో ఉద్యోగాలు అనగానే ఎగేసుకుని వెళ్లి మరీ డబ్బులు కట్టేయడం వీరి అవివేకానికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**నోటిఫికేషన్ లేకుండానే..**

ఇటీవల కాలంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఎటువంటి నోటిఫికేషన్ ప్రభుత్వం ఇవ్వలేదు. అందులోనూ గత రెండు నెలలుగా ఎన్నికల హడావిడితో అధికారులంతా బిజీబిజీగా ఉన్నారు. మరి అలాంటప్పుడు వారికి ఉద్యోగాలు ఎలా వచ్చాయి? ఎవరిచ్చారు? అని కనీసం ఆరా తీయకుండా జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చిన వెంటనే వారిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏ ప్రాతిపదికన విధుల్లో చేర్చుకున్నారో అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. అయితే ఈ ఉద్యోగాలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి రావని, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తాయని, వీరికి మీరు కేవలం డ్యూటీ సర్టిఫికెట్ ఇస్తే చాలు జీతాలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చిన వ్యక్తి ఫోన్‌లో చెప్పడంతో..సరేలే మనకేం పోయిందని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వారిని విధుల్లో చేర్చుకున్నట్లు సమాచారం.



CHILDREN'S DEVELOPMENT EDUCATIONAL CHANGING ASSOCIATOR

వీరఘట్టంలోని ఓ పాఠశాలలో ఈనెల 13న చేరిన మహిళ ఇచ్చిన జాయినింగ్ ఆర్డర్

### ఆ పోస్టులతో సంబంధం లేదు



వీరఘట్టం మండలంలో పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఉద్యోగాలు వచ్చాయని చేరిన వారికి ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదు.ఇటువంటి నియామకాలు జరుగుతున్నట్లు మీడియా ద్వారా తెలిసింది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాం.ఎవరైనా ఇటువంటి వారు వస్తే ముందు జిల్లా అధికారులకు తెలియజేయాలని సూచించాం.ఆ ఉద్యోగాలు ప్రభుత్వ నియామకాలు కావు. పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం.

జి.పగడాలమ్మ, డీఈఓ,
పార్వతీపురం మన్యం జిల్లా

### నిరుద్యోగ యువత అప్రమత్తం



ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంత మంది దళారులు నిరుద్యోగ యువతను మభ్యపెడుతున్నారు.అటువంటి వారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి.ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు చేపట్టి దళారుల ఆటకట్టిస్తాం.

జీవీ కృష్ణారావు, డీఎస్పీ, పాలకొండ

## క్లుప్తంగా

### ఒరిగిన ఆర్టీసీ బస్సు

● తప్పిన ప్రమాదం



పానుగుటివలస సమీపంలో గోతిలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

**రాజాం :** రాజాం నుంచి సంతకవిటి వైపు ఆదివారం ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు పానుగుటివలస దాటిన వెంటనే రోడ్డుపక్కన ఉన్న గుంతలో ఒరిగిపోయింది. వారం రోజుల కిందట టెలిఫోన్ లైన్ల నిమిత్తం తవ్విన గోతులు సక్రమంగా పూడ్చకపోవడంతో వర్షాలకు నీరు చేరి గోతులు పెద్దవిగా మారాయి. ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రమాదవశాత్తూ గోతిలో ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఇదిలా ఉంటే ఒరిగిన బస్సును బయటకు తీయడంలో అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో రాజాం - సంతకవిటి రోడ్డులో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

### చేపల వర్తకులపై కేసు నమోదు



చేపల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

**విజయనగరం:** పట్టణంలోని పలు కూడళ్ల వద్ద నిర్వహిస్తున్న చికెన్, మాటన్, చేపల దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం దాడులు చేపట్టారు. తూనిక రాళ్లు వినియోగించి వినియోగదారులను మోసగిస్తున్న ముగ్గురు చేపల వర్తకులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా వినియోగదారులు కూడా మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని.. ఇందులోభాగంగా నెలలో రెండు చోట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. తూకంలో మోసాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎం. దామోదరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఆదినారాయణ (ఫైల్)

**సాలూరు రూరల్:** మండలంలోని చీపురువలస వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అన్నంరాజువలస పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన రొంపల్లి ఆదినారాయణ శనివారం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి చీపురువలస వైపు వస్తుండగా.. ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆదినారాయణను మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం సాలూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి, అనంతరం తిరుమల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడు పాచిపెంట మండలం గురువునాయుడుపేట పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమార్తె, కుమారుడున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిబంధనలు బేఖాతరు

- ఎన్‌ఓసీ లేకుండానే కొనసాగుతున్న పెట్రోల్ బంకులు, కోల్డ్ స్టోరేజీలు
- ఇష్టారాజ్యంగా నిర్వహణ
- నోటీసులకు స్పందించని యాజమాన్యాలు
- పెట్రోల్ బంకుల్లో కనిపించని సౌకర్యాలు, సేవలు
- కానరాని అధికారుల తనిఖీలు



ఎన్‌ఓసీ రెన్యువల్ చేసుకోని పెట్రోల్ బంకు

**రామభద్రపురం:** పరిశ్రమలు, గిండ్డంగులు, సామిల్లులు, ఆస్పత్రులు, పెట్రోల్ బంకులు, దుస్తుల దుకాణాలు, సినిమా థియేటర్లు, హోమ్‌నీడ్స్, పాఠశాలలు ఇలా ప్రజలతో ముడిపడి ఉన్న సంస్థలేవైనా స్థాపించి కొనసాగించాలంటే సంబంధిత యాజమాన్యాలు ముందుగా అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సిందే. అలాగే ఆయా విభాగాల అనుమతులు కూడా తీసుకోవాలి. ఒకవేళ అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకుంటే ప్రతి ఏటా రెన్యువల్ చేసుకోవాలి. అయితే ఈ నిబంధనలేవీ పట్టించుకోకుండా మండలంలో కొన్ని సంస్థలు కొనసాగుతున్నాయి. రెండేళ్ల కిందట సాలూరు రూట్‌లో ఏర్పాటు చేసిన పెంట్రోల్ బంకులు మొదట్లో అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్నారు. అయితే ఆ అనుమతులు ముగిసిపోయి రెండేళ్లు కావొస్తున్నా ఇప్పటికీ రెన్యువల్ చేసుకోలేదు. సదరు యాజమాన్యాలకు అగ్నిమాపక శాఖాధికారులు నోటీసులిచ్చినా స్పందించలేదని సమాచారం. పెట్రోల్ బంకుల్లో ప్రమాదాలేవైనా జరిగితే ఎవరు బాధ్యులవుతారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### పరిశీలన ఊసేలేదు...

వాస్తవానికి బంకుల వద్ద ఏ రోజుకారోజు పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాలి. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత కొరవడితే ఏ అధికారికి ఫిర్యాదు చేయాలి..? ఎవరిని సంప్రదించాలి..? వారి పేర్లు, హోదా తెలియజేస్తూ ఫోన్ నంబర్లు నోటీసు బోర్డులో పొందుపరచాలి. కానీ కొద్ది బంకుల్లో మాత్రమే ఇటువంటివి కనిపిస్తుంటాయి. తూనికలు, కొలతల శాఖాధికారులతో పాటు స్థానిక రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు బంకులను తనిఖీ చేయాలి. సంబంధిత ఆయిల్ కంపెనీ ప్రతినిధి సైతం సందర్శించి పెట్రోల్, డీజిల్ నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇవేమీ జరగడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. అలాగే పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేటప్పుడు అన్ని సదుపాయాలు ఉంటేనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) ఇవ్వాల్సి ఉంది. కానీ సంబంధిత అధికారులు ఇవేవీ చూడకుండానే అనుమతి పత్రాలు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

#### కానరాని నిబంధనలు..

పెట్రోల్ బంకుల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. సగానికి పైగా బంకుల్లో ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు కనిపించవు. ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారే తప్ప కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. త్వరగా గమ్యం చేరాలనే వినియోగదారుడి ఆరాటం, అవగాన లోపం బంకుల యాజమాన్యాలకు కలిసివస్తోంది.

#### పెట్రోల్ బంకుల వద్ద కల్పించాల్సిన సౌకర్యాలు..

- పెట్రోల్ బంకుల వద్ద స్వచ్ఛమైన తాగునీరు సదుపాయం కల్పించాలి. దీనికోసం బంకు యజమాని ఆర్‌ఓ మెషీన్, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి. ఒకవేళ ఏ పెట్రోల్ బంకులోనైనా తాగునీటి సౌకర్యం లేకపోతే వినియోగదారుడు చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు.
- వినియోగదారులు అత్యవసర, అనారోగ్య సమయాల్లో ఫోన్ చేసుకునేందుకు పెట్రోల్ బంకుల వద్ద ఉచిత ఫోన్ సౌకర్యం కల్పించాలి. వాహనదారులు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకుంటే ఆ సమయంలో వాహన చోదకుడు వద్ద మొబైల్ ఫోన్ లేకపోతే..సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు దగ్గరకు వెళ్లి అక్కడ ఉన్న ఉచిత టెలీఫోన్ ద్వారా వినియోగదారుడు కాల్స్ చేసుకోవచ్చు.
- అన్నిటికంటే ముఖ్యంగా పెట్రోల్ బంకుల వద్ద మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. మరుగుదొడ్లు లేకుంటే సంబంధిత చమురు కంపెనీకి లేదా పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లకు ఫిర్యాదు చేయొచ్చు.
- ప్రతి పెట్రోల్ బంకు వద్ద ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండాలి. వినియోగదారులు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకోవచ్చు. యాజమాన్యం ప్రథమ చికిత్స కిట్టు ఇవ్వడానికి నిరాకరిస్తే రాత పూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చు.
- పెట్రోల్, డీజిల్‌కి సంబంధించి బిల్లు ఇవ్వడానికి నిరాకరిస్తే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఎయిర్ మెషీన్ ఏర్పాటు చేసి అవసరమైన వాహనాల టైర్లలో ఉచితంగా గాలి నింపాలి.
- అలాగే ఫిర్యాదు బాక్స్ లేదా రిజిస్టర్ ఉంచాలి. ఇందులో వినియోగదారులు తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు. లేదంటే సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్‌ను సందర్శించి ఫిర్యాదు చేయవచ్చు.

#### నిబంధనలు పాటించాల్సిందే...

పెట్రోల్ బంకు యాజమాన్యాలు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. తాగునీరు, మరుగుదొడ్లు, ఉచితంగా గాలి వంటివి తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి. అధికారులు ఎప్పటికప్పుడు బంకులను పరిశీలిస్తున్నారు. కనీస సౌకర్యాలతో పాటు వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ నాణ్యత, పరిమాణాన్ని తెలుసుకునే హక్కు కూడా ఉంది. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు.

– ఎ. సులోచనారాణి, తహసీల్దార్, రామభద్రపురం

#### నోటీసులిచ్చాం..

సామూహిక ప్రజలతో ముడిపడి ఉన్న సంస్థలేవైనా అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా ఎన్‌ఓసీ తీసుకోవాలి. బాడంగి అగ్నిమాపకేంద్రం పరిధిలో ఎన్‌ఓసీ లేని పరిశ్రమలకు నోటీసులిచ్చాం. అలాగే సాలూరు రూట్‌లో ఉన్న పెట్రోల్ బంకులు ఎన్‌ఓసీ రెన్యువల్ చేసుకోవాలని నోటీసులిచ్చాం. ఇంతవరకు వారి నుంచి స్పందన లేదు. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– టీఆర్ నాయుడు, అగ్నిమాపకశాఖాధికారి, బాడంగి

# విత్తన చట్టం గురించి తెలుసా..



ఓ ప్రైవేటు దుకాణంలో వివిధ రకాల విత్తనాలు

- ప్రతి ప్రైవేటు విత్తనాల దుకాణంలో లైసెన్సు ప్రదర్శించాలి
- కొనుగోలుదారునికి రశీదు తప్పనిసరి

**టెక్కలి:** ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయి. అయితే రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకుని రైతులను మోసగించే చర్యలకు కళ్లెం వేసేందుకు విత్తన చట్టం ఒకటి ఉందని పూర్తి స్థాయిలో రైతులకు తెలియదు. విత్తనాలు కొనుగోలు చేసే రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా ఈ చట్టం ద్వారా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠినతరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంది. విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 తదితర చట్టాలు పొందు పరచి విత్తనపరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడిన వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 3 అతిక్రమించినందుకు ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ ఏ ప్రకారం జరిమానాకు గురవుతారు. వీటిలో కొన్ని చట్టాలను గమనిస్తే...

#### విత్తన లైసెన్సు ప్రదర్శన తప్పనిసరి

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. విత్తన లైసెన్సు లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలను నిలిపివేయవచ్చు. అంతే కాక నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 5 ప్రకారం డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

#### ధరల బోర్డు, స్టాకు బోర్డు ఏర్పాటు చేయాలి

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. అలా లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. అంతే కాకుండా అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.



#### అమ్మకాల రశీదు ఇవ్వాల్సిందే

విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. రశీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 9 ప్రకారం ఆయా దుకాణదారునికి ముందుగా నోటీ సు జారీ చేసి దానికి సరైన సమా ధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్సును సస్పెండ్, రద్దు చేయవచ్చు.

#### విత్తనాల బస్తాలపై లేబుల్ లేకపోతే..

ప్రైవేట్ విత్తనాల అమ్మకందారుడి వద్ద కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం–1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. అంతే కాకుండా ఆయా విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం -1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం -1966 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 8 ను అనుసరిస్తూ డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

#### జిల్లాలో ఇలా..

జిల్లాలో సుమారు 495 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు ఉన్నాయి. వాటిలో సుమారు 132 మంది విత్తనాల విక్రయాల డీలర్లు, 196 మంది ఎరువుల విక్రయాల డీలర్లు, 167 మంది పురుగు మందు విక్రయాల డీలర్లు ఉన్నారు.

#### నిబంధనలు పాటించాలి

ప్రభుత్వం పొందు పరిచిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఈ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణాల లైసెన్సును పోగొట్టుకునే పరిస్థితి ఉంటుంది.

– బీవీ తిరుమలరావు, ఏడీ, వ్యవసాయ శాఖ, టెక్కలి

### అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



జలాశయంలో నాగేశ్వరరావు మృతదేహం (ఇన్‌సెట్లో) నాగేశ్వరరావు (ఫైల్)



**గంట్యాడ :** మండలంలోని తాటిపూడి జలాశయంలో పడి ఒకరు మృతి చెందారు. అయితే ఈ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన జలగడుగుల నాగేశ్వరరావుకు ఎస్.కోటకు చెందిన వరలక్ష్మితో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. ఈ నెల 14న భార్యతో కలిసి అత్తవారింటికి వచ్చిన నాగేశ్వరరావు తాటిపూడి జలాశయానికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో నాగేశ్వరరావు భార్య ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే ఆదివారం ఉదయం తాటిపూడి జలాశయంలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి చూడగా.. నాగేశ్వరరావు మృతదేహంగా గుర్తించారు. అయితే ప్రమాదవశాత్తూ జలాశయంలో పడిపోయాడా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేల బావిలో పడిన ట్రాక్టర్



క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ను పైకి తీస్తున్న దృశ్యం

● డ్రైవర్ మృతి

**లక్కవరపుకోట :** నేలబావిలో ట్రాక్టర్ పడిపోవడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని రేగ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ అప్పలరాజుకు చెందిన ట్రాక్టర్‌కు అదే గ్రామానికి చెందిన కోన సూర్యనారాయణ (43) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రేగ గ్రామ సమీపంలోని మామిడి తోటల్లో దుక్కు చేపట్టేందుకు సూర్యనారాయణ ఆదివారం ఉదయం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో దుక్కు చేపడుతుండగా.. వెనక్కి మళ్లే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి వెనుకనే గల నేలబావిలో పడిపోయింది. అక్కడున్న వారు వెంటనే స్పందించి గట్టిగా కేకలు వేయడంతో పాటు విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో రేగ, కళ్లేపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి బావిలోనుంచి ట్రాక్టర్ తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కొత్తవలస నుంచి భారీ క్రేన్‌ను తీసుకువచ్చి అతి కష్టంమీద ట్రాక్టర్‌ను బయటకు తీశారు. డ్రైవర్ సూర్యనారాయణ అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు మగ, ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఆడపిల్లలకు వివాహాలు జరిగాయి. ఇంటి పెద్దదిక్కు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. హెచ్‌సీ త్రిమూర్తులు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సూర్యనారాయణ

### రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

**టెక్కలి రూరల్:** మండలంలోని జెండాపేట గ్రామ సమీపంలో గల రైల్వే ట్రాక్‌కు కొంత దూరంలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న టెక్కలి ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఐ వెంకటరమణలు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని వెస్ట్‌బెంగాల్‌కు చెందిన హుమయాన్ మే అనే వ్యక్తిగా గుర్తించారు. ఆ వ్యక్తి మృతికి గల కారణాలు తెలియడం లేదని పోలీసులు తెలిపారు.

#### చికెన్

| బ్రాయిలర్ | | |
|---|---|---|
| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
| ₹148 | ₹266 | ₹276 |



# అనుమతుల్లేకుండా భవన నిర్మాణాలు



ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఐదంతస్తుల భవనం

**నెల్లిమర్ల:** నగర పంచాయతీలో అనుమతుల్లేకుండా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పేదలు ఇళ్ల నిర్మాణాలు చేపడితే సవాలక్ష అనుమతులు కావాలని వేధించే అధికారులు... పెద్దల భవనాల వైపు మాత్రం కన్నెత్తి చూడడం లేదు. నెల్లిమర్ల నగర పంచాయతీలో ఉడా అనుమమతులు తీసుకోకుండా చాలా మంది బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. వీరు ప్రభుత్వ పరంగా ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడం విశేషం. టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లు అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనుమతుల్లేని భవన నిర్మాణాలను ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. పట్టణంలోని మొయిద జంక్షన్‌లో ఉన్న సత్య సినిమా థియేటర్ వద్ద అనధికార భవన నిర్మాణంపై పట్టణవాసులు, ప్రజాప్రతినిధుల్లో తీవ్రమైన చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఇక్కడ ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. కనీసం ప్లాన్ అప్రూవల్‌కు కూడా దరఖాస్తు చేయలేదు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయడానికి ఇంతవరకు ముందుకు రాలేదు. వాస్తవానికి నెల్లిమర్ల పట్టణంలో మూడు అంతస్తులకు మించి భవనాలు నిర్మించకూడదు. ఒకవేళ అలా నిర్మించాలనుకుంటే ప్రత్యేకంగా ఉడా నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే అలా చేయకుండానే ఈ బహుళ అంతస్తుల భవనం నిర్మించడం విశేషం. కనీసం స్థలం వదలకుండా భవనాన్ని నిర్మిస్తున్నారు. దీంతో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా భారీస్థాయిలో విధ్వంసం సంభవించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు ఇదే విషయాన్ని లేవనెత్తారు. అలాగే చంద్రబాబు కాలనీ, అలబాన వీధి, గాంధీనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తు భవనాలు నిర్మిస్తున్నారు. ఇదే విషయమై నగర పంచాయతీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ ఫిలిప్స్ వివరణ కోరగా.. సదరు భవన యజమానికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. అవసరమైతే కేసు నమోద చేస్తామని చెప్పారు.

# టీకాలతో వ్యాధులు దూరం..

- ప్రతి సోమ, గురువారాల్లో ఉచితంగా టీకాలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా నిల్వలు



పూసపాటిరేగ పీహెచ్‌సీలో బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

**పూసపాటిరేగ :** వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భం దాల్చినప్పటి నుంచి అప్పుడే పుట్టిన చిన్నారులకు ప్రభుత్వం సూచించిన సమయాలలో ఆయా టీకాలు, వ్యాక్సిన్‌లు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. కొన్ని సందర్భాలలో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న ఉచిత టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సోమ, గురువారాల్లో గర్భిణులు, చిన్నారులు, వయోజనులకు ఉచితంగా వ్యాధినిరోధక టీకాలు వేస్తారు.

#### వాక్సిన్లు వేసేదిలా..

- గర్భిణిగా నిర్ధారైన మూడు నెలలు నిండిన తర్వాత టీటీ ఇంజక్షన్ వేయాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్, ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు వేసుకోవాలి.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బి డోసు వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- ఆరు, 14 వారాలలో ఐవీపీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వ్యాక్సిన్ వేయించాలి.
- తొమ్మిది నెలలు నిండి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్ -ఎ చుక్కలు వేయించాలి.
- 16 నెలలు నిండి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్ విటమిన్- ఏ వేయించాలి.
- ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి.
- 10, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్ (టీటీ) వేయించాలి
- తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకు ప్రతి ఆరు నెలలకోసారి విటమిన్-ఎ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.
- 60 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న వ్యక్తులకు బీసీజీ టీకాలు వేయించాలి.

#### టీకాలు తప్పనిసరి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. తాజాగా వచ్చిన బీసీజీ టీకాలను క్షవ్యాధి ఉన్నా, 60 సంవత్సరాలు పైబడినా వేయించుకోవాలి. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– రాజేష్‌వర్మ, వైద్యాధికారి, పూసపాటిరేగ పీహెచ్‌సీ